





రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, పక్కన లావు శ్రీకృష్ణదేవరాయులు, వైవీ ఆంజనేయులు

అట్టహాసంగా కన్నా నామినేషన్

- భారీ ర్యాలీ.. అడుగడుగునా నీరాజనం

సత్తెనపల్లి, ఏప్రిల్ 22: సత్తెనపల్లి నియోజక వర్గ కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా కన్నా లక్ష్మీనారాయణ సోమవారం నామినేషన్ వేశారు. నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలతో కలసి రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణకు నామినేషన్ పత్రాలను కన్నా అందజేశారు. నామినేషన్‌కు ముందు స్థానిక రఘురామ్ నగర్‌లోని తన కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు చేసి ఎన్టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కన్నా నామినేషన్ వేసేందుకు ర్యాలీగా బయల్దేరారు. ప్రత్యేక రథంపై కన్నా లక్ష్మీనారాయణ వేలాది మంది పార్టీ శ్రేణులతో కలసి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా తరలి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. తెలుగు పట్టణ అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ ఆధ్వర్యంలో మహిళలు కన్నాకు హారతులు ఇచ్చారు. ర్యాలీ పొడవునా తెలంగాణ డప్పు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తా

రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. నామినేషన్ అనంతరం అమ రావతి బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఒక్క ఛాన్స్ పేరుతో జగన్ రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. రాష్ట్రాన్ని గాలికి వదిలి వేసిన జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. అమరావతి రాజధానిగా కొనసాగాలన్నా, గోదావరి-పెన్నా నదుల అనుసంధానం జరగాలన్నా ఎన్‌డీఏ కూటమి అధికారంతోనే సాధ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి కన్నా లక్ష్మీనారాయణ గెలుపు సత్తెనపల్లికి కొండంత అండ అన్నారు. టీడీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, రాష్ట్ర నాయకులు కనుమూరి బాజీ చౌదరి, చౌట శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నేత అంకాళ్ళ ప్రభుదాసు, జనసేన నేతలు తోట నర్సయ్య, తవిటి భవన్నారాయణ, బీజేపీ నేత కట్టా శంకరరావు తదితరులు మాట్లాడుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కన్నాను, ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలను గెలిపించాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు నేతలు ఈమని చంద్రశేఖర్, కొర్రపాటి సురేష్ ఆధ్వ ర్యంలో కన్నాను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, డాక్టర్ కోడెల శివరామ్, చౌట శ్రీనివాసరావు, నేతలు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, తాతా జయప్రకాష్ నారాయణ, జనసేన నేతలు కొమ్మిశెట్టి సాంబశివరావు, తవిటి భవన్నారాయణ, శిరిగిరి శ్రీనివాసరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కట్టా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా నామినేషన్‌కు వెళుతున్న కన్నా

- పండించిన పంటకు గిట్టుబాటు దక్కక అన్నదాతల అవస్థలు
- జిల్లాలో నాలుగేళ్లుగా ఏటికేడు తీసికట్టుగా ధాన్యం సేకరణ
- నామమాత్రంగానే మార్క్‌ఫెడ్ పాత్ర
- దిగుబడులకు, సేకరణలకు పొంతనే ఉండని వైనం
- రైతుల ఆక్రందన పట్టని వైసీపీ ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వని పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పిస్తుంది.. పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచే ఏర్పాటు చేస్తాం.. ఇలా ఒకటేమిటి ఎన్నో వాగ్దానాలు 2019కు ముందు సీఎం జగన్ గుప్పించారు. అయిదేళ్ల తర్వాత సీన్ కట్‌చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించే సంగతి దేవుడెరుగు.. ఏటికేడు రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసే ధాన్యం పరిమాణం పడిపోతూ వస్తోంది. పైగా కొనుగోలు కేంద్రాలూ అందుబాటులో ఉండవు.

అరకొరగా కొనుగోలు చేసిన ధాన్యం విషయంలో డబ్బులు పడడం మరో ప్రహసనం. ఇక వాణిజ్య పంటలైన మినుము, పెసరతో పాటు మొక్కజొన్న తదితర పంటల కొనుగోలు విషయంలో మార్క్‌ఫెడ్ పాత్ర నామమాత్రం. మొక్కుబడి తంతుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్పితే జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పంటల సంగతి అడిగితే నీళ్లు నమలడం అధికారుల వంతవుతోంది. పైగా రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల పంపిణీ విషయంలో మార్క్‌ఫెడ్‌ను చేర్చి దాని అసలు ఉద్దేశం నీరుగార్చే ప్రక్రియకు తెరలేపిన ఘనత వైసీపీది. ఈ విధంగా ఐదేళ్లలో జిల్లాలోని రైతాంగానికి అడుగడుగునా అన్యాయం చేసిన ప్రభుత్వంగా వైసీపీ ప్రభుత్వం మిగిలిపోయిందని రైతులు విమర్శిస్తున్నారు.

మద్దతు ధర.. ఎండమావే!

బాపట్ల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ విషయంలో ఏటికేడు తీసికట్టే అన్నట్లు ఉంటోంది. 2023–24కు సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 78,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ముగింపుకొచ్చేసరికి అదికాస్తా 28,500 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. గతేడాది ఖరీఫ్‌లో అయితే 1,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకుంటే ఇది కాస్తా 75,000 మెట్రిక్ టన్నుల దగ్గరే ఆగింది. తాజా ఖరీఫ్‌లో సేకరణ గతంతో పోలిస్తే దారుణంగా పడిపోయింది. రబీ సీజన్‌లోనూ ఇదే తంతు. పెట్టుకున్న లక్ష్యాలకు సేకరణకు హస్తిమశకాంతరం ఉంటోంది. ఈ ఐదేళ్లలో ఏ ఒక్క సంవత్సరం కూడా ధాన్యం సేకరణ పరిమాణం పెరగకపోగా సీజన్, సీజన్‌కు తగ్గుదల నమోదవడం గమనార్హం.

సొమ్ము జమ చేయడంలోనూ నిర్లక్ష్యమే..

అరొకరగా సేకరించిన ధాన్యానికి సొమ్ము జమ చేయడంలోనూ వైసీపీ ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపెట్టింది. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే డబ్బు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయి తప్పితే రైతులకు కష్టాలు తప్పలేదు. టీడీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. ఈ అయిదేళ్లలో డబ్బు జమ విషయంలో వైసీపీ వేసిన పిల్లిమొగ్గలు అన్నీఇన్నీ కావు. ధాన్యం సేకరణ విషయంలోనూ ఏకీకృతం అనే కొత్త ఎత్తుగడకు వైసీపీ ప్రభుత్వం తెరతీసింది. ధాన్యం సేకరణను గుత్తాధిపత్యం చేసే ఆలోచనలో భాగంగా ఒకే మిల్లరుకు అప్పగించేలా టెండర్లను కూడా పిలిచింది. ఇది ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

మార్క్‌ఫెడ్ పాత్ర నామమాత్రమే...

జిల్లా ఆవిర్భావం తర్వాత మార్క్‌ఫెడ్ బాపట్లలో కొలువుదీరడానికే దాదాపు ఏడాది పట్టింది. వచ్చిన తర్వాత అయినా పూర్తిస్థాయిలో పనిచేయడం మొదలుపెట్టిందా అంటే అదీ లేదు. ఏదో మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు తెరిచి మమ అనిపించడం మినహా అన్నదాతల నుంచి సేకరించిన దిగుబడులు తీసికట్టే. జిల్లాలో మినుము దాదాపు 50,000 హెక్టార్ల లో సాగు అవుతుండగా, పెసర, శనగ కలిపి దాదాపు 35,000 హెక్టార్ల వరకు సాగు విస్తీర్ణం ఉంది. వీటికి తోడు జొన్న, మొక్కజొన్న, శనగ సేకరణ కూడా మార్క్‌ఫెడ్ బాధ్యతే. మద్దతు ధర మినుము క్వింటాలకు రూ.6,950 ఉండగా, పెసర క్వింటాకు రూ.8,558గా ఉంది. సాగైన విస్తీర్ణంతో పోల్చుకుంటే మొక్కజొన్నతో కూడా కలుపుకుని కనీసం 30,000 టన్నులైనా మార్క్‌ఫెడ్ సేకరించాల్సి ఉంటుంది. కానీ ఈ రెండేళ్లలో మార్క్‌ఫెడ్ పట్టుమని పదివేల టన్నులైనా సేకరించిన దాఖలాలు లేవు. దిగుబడులు దాదాపు లక్ష మెట్రిక్ టన్నులపైన ఉంటే మార్క్‌ఫెడ్ విధించుకునే సేకరణ లక్ష్యాలు పదిశాతం లోపే. దానిని చేరడానికి కూడా ఆపసోపాలు పడే పరిస్థితి ప్రభుత్వానిది.

పంట పండించుకుంటున్న దళారులు...

ప్రభుత్వం మద్దతు ధర విషయంలో రైతులకు చేస్తున్న అన్యాయం దళారులకు వరంగా మారుతోంది. ముఖ్యంగా ధాన్యం మద్దతు ధర విషయంలో ప్రభుత్వం విధించే అలవిమాలిన నిబంధనలు అన్నదాతలకు గుదిబండగా మారి కొనుగోలు కేంద్రాల వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇక ధాన్యం డబ్బుల జమ విషయంలో నెలల తరబడి జరుగుతున్న జాప్యం కూడా వారిని దళారుల వైపు మళ్లేలా పురిగొల్పుతోంది. దీంతో ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇలా ఈ ఐదేళ్లలో మద్దతు ధర విషయంలో రైతులు నిలువునా మోసానికి గురయ్యారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ ఉందో పాలకులకే తెలియాలి. ఇక మిర్చి రైతుల గోడు వినేవారే కరువ య్యారు. జిల్లాలో ధాన్యం తర్వాత ఉద్యాన పంట అయినా మిర్చి వైపు అన్నదాతలు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. కేంద్రం మద్దతు ధర ఇవ్వని పంటలకు తన ప్రభుత్వం ఇస్తుందని జగన్ చెప్పిన మాటలను ఎన్నికల వేళ సీఎంకు రైతులు గుర్తు చేస్తున్నారు.

రకరకాల సాకులు

మద్దతు ధర విషయంలో అన్నదాతలకు జరుగుతున్న అన్యాయం విషయంలో ప్రభుత్వం ఏవో కుంటిసాకులు చెబుతూనే వస్తోంది. ఆర్‌బీకేలకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామనే మార్క్‌ఫెడ్ మాటలు ఉత్తమాటలుగానే మిగిలిపోతున్నాయి. ఏదో మొక్కుబడిగా ఒకటిరెండు రోజులు ఏర్పాటు చేయడం తర్వాత సర్దేయడం రివాజుగా మారింది. పైగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడం వల్ల మద్దతు ధరకు అమ్ముకోవడానికి అన్నదాతలు ఆసక్తి చూపించడం లేదని చెబుతారు. ఇది కొంతమేర వాస్తవమే అయినప్పటికీ సమాంతరంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరచి ఉంటేనే బయటి మార్కెట్‌లో ధర స్థిరంగా ఉంటుందనే ప్రాథమిక సూత్రాన్ని కూడా మరచి అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఇక పత్తి కొనుగోలు విషయంలో సీసీఐది కీలక పాత్ర. దీనికి సంబంధించి బాపట్ల జిల్లాలో ప్రతినిధులెవరో, కార్యాలయమెక్కడో ఎవరికీ తెలియదు.

గురజాల ప్రభంజనం

- పసుపుమయంగా మారిన పట్టణం
- అట్టహాసంగా యరపతినేని శ్రీనివాసరావు నామినేషన్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 22: కూటమి తరపున గురజాల అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన జనంతో గురజాల జన ప్రభంజనంగా మారింది. పసుపు జెండాలతో పట్టణం పసుపుమయంగా మారింది. నామినేషన్‌కు ముందు యరపతినేని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఒకే కారులో కలసి వెళ్లి దారి పొడవునా దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. వీరాపురం నుంచి దాచేపల్లి మీదగా గురజాల చేరుకున్న యరపతినేనికి దారిపొడవున పార్టీ శ్రేణులు, మహిళలు పెద్దఎత్తున నీరాజనాలు పలికారు. నామినేషన్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. మధ్యాహ్నం 12 గంటలకు మండే ఎండని లెక్కచేయకుండా నామినేషన్ కార్యక్రమం పూర్తయ్యేదాక యువత బైక్, వాహన ర్యాలీలతో సందడి చేశారు. పార్టీశ్రేణుల బాణసంచా, తీన్‌మార్ వాయిద్యాలు, నినాదాలతో పట్టణం మోతెక్కింది. మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, నంద్యాల ధనుంజయరెడ్డి, న్యాయవాది సూర్యరాజులతో కలిసి యరపతినేని గురజాల ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌వో రమణాకాంత్ రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. అరాచకం పోవాలన్నా మీ ఆస్తులు మీకు దక్కాలన్నా ఓటు ఎవరికి వేయాలో ఆలోచించుకోవాలన్నారు. యరపతినేని మాట్లాడుతూ అణచివేతపై తిరుగుబాటు మొదలైందన్నారు. గురజాలలో కాసు అరాచకానికి, యరపతినేని అభివృద్ధికి మధ్య జరుగుతున్న పోరులో వైసీపీకి ఓటమి తప్పదన్నారు. గురజాలలో దోచుకుని నరసరావుపేటలో దాచుకోవడం కాసు మహేష్‌రెడ్డి నైజమని అందరికీ అర్థ మైందన్నారు. గత ఎన్నికల్లో మహేష్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా ఎస్సీఎస్టీ, బీసీ మైనారిటీలపై దాడులు, అక్రమకేసులు పెట్టించారన్నారు.



యరపతినేని, జంగా, లావు అభివాదం



రిటర్నింగ్ అధికారి రమణాకాంత్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, జంగా కృష్ణమూర్తి

కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జాం

దండివాగు వద్ద పోలీసులు పలు వాహనాలను నిలిపివేశారు. కొత్త అంబాపురం నుంచి గురజాల వరకు 5 కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ నిలిచిపోయింది. గుంటూరు - మాచర్ల రహదారిలో కూడా కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ఆలస్యంగా ప్రచార రథం వద్దకు చేరుకున్నారు. పార్టీ శ్రేణులు కూడా ఎండలో రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ రావాల్సి వచ్చింది.



నామినేషన్ కార్యక్రమానికి హాజరైన పార్టీ శ్రేణులు

బాలికలదే హవా

- పది ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- బాపట్ల 88.19, గుంటూరు 88.14, పల్నాడు 86.05 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయిలో 14, 16, 18 స్థానాల్లో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలు

6లో..

బాలికలదే హవా...

- 'పది' ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- బాపట్ల 88.19, గుంటూరు 88.14, పల్నాడు 86.05 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 14, 16, 18 స్థానాల్లో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలు

గుంటూరు(విద్య), నరసరావుపేట, బాపట్ల టౌన్, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా చూపారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పది పరీక్షలకు సంబంధించి ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఉత్తీర్ణతలో ముందు ఉన్నారు. గుంటూరు జిల్లా నుంచి 27,178 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 23,955 మంది (88.14 శాతం ఉత్తీర్ణత సాధించారు.

బాపట్లజిల్లా నుంచి 16718 మంది హాజరుకాగా 14,743 మంది (89.19 శాతం) సాధించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 11శాతం ఉత్తీర్ణత పెరిగింది. జిల్లాలో అబ్బాయిలు 86.32, అమ్మాయిలు 91.11శాతం ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు జిల్లాలో అబ్బాయిలు 86.46, అమ్మాయిలు 89.9శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో బాపట్ల జిల్లాకు 14వ స్థానం దక్కింది.

పల్నాడుజిల్లా నుంచి 24,959 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 21,477 మంది (86.05 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. పల్నాడులో అబ్బాయిలు 83.77, అమ్మాయిలు 88.45శాతం ఉత్తీర్ణత సాధించారు. 16,769 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత కాగా 3,482 మంది ఫెయిలయ్యారు. గత ఏడాది కంటే ఉత్తీర్ణత 17.10 శాతం పెరిగింది. రాష్ట్రంలో పల్నాడు జిల్లా 18వ స్థానంలో నిలిచింది. గతేడాది బాపట్లజిల్లా 75.31 శాతం, గుంటూరు 77.4 శాతం, పల్నాడు 69.47 శాతంగా నమోదైంది. అంటే ఈ ఏడాది ఫలితాలు మెరుగైనట్లే.

యాప్‌లే కారణమా.. విద్యారంగ ఖిల్లాగా పేరొందిన గుంటూరు జిల్లా పది ఫలితాల్లో చతికల పడింది. ఒకప్పటి ఉమ్మడి రాష్ట్రంలో టాప్‌టెన్‌లో ఉన్న జిల్లా ఈ ఏడాది దిగజారింది. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ హడావిడి ఫలితాల్లో ఎక్కడా కనపించలేదు. యాప్‌ల యావ తప్ప.. పర్యవేక్షణా లోపం ఫలితాల సాధనలో స్పష్టంగా కనిపించింది. హెచ్‌ఎం స్థాయి నుంచి స్కూల్ అసిస్టెంట్ వరకు ఏదో ఒక యాప్‌ల పనుల్లోనే మునిగిపోయారు. ఉదయం మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం, గుడ్లు పంపిణీ, చిక్కీల పంపిణీ, నాడు నేడు పనుల పర్యవేక్షణ ఇలా ప్రతిదానికీ యాప్‌లతోనే ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. మరో వైపు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పాఠశాలలకు వచ్చిచేసే హడావిడితో అసలు బోధనే మరుగున పడి ఫలితాల్లో వెనుకంజ పడినట్లు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

పల్నాడు జిల్లాలోని అనేక పాఠశాలల నుంచి సబ్జెక్టు టీచర్లు గుంటూరు జిల్లాలోని అనేక పాఠశాలల్లో అక్రమ బదిలీపై చేరిపోయారు. దీంతో అక్కడ భారీస్థాయిలో టీచర్ల కొరత ఏర్పడింది. కనీసం విద్యా వలంటీర్లను నియమించుకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు జడ్పీ, ప్రభుత్వ, కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కనీసం పరీక్షల సమయంలో అల్పాహారం అందించలేని దుస్థితి నెలకొంది, ఇలా అనేక కారణాలతో ఉమ్మడి జిల్లాలో ఉత్తీర్ణత దిగజారినట్లు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు విశ్లేషించారు.

కాంగ్రెస్ అభ్యర్థుల మలి విడత జాబితా విడుదల

గుంటూరు, ఏప్రిల్ 22: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మలి విడత జాబితాను ఆ పార్టీ అధిష్ఠానం సోమవారం రాత్రి విడుదల చేసింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, తెనాలి నియోజకవర్గం నుంచి షేక్ బాషీద్, రేపల్లె మోపిదేవి శ్రీనివాసరావు కాగా ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన తాడికొండకు మణిచల సుశీల్‌రాజాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాడికొండకు చిలకా విజయ్‌కుమార్‌ను తొలి జాబితాలో ప్రకటించి తాజాగా ఆయన్ను తప్పించి ఆయన స్థానంలో సుశీల్ రాజాను నియమించటం, తెనాలిలో పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ, తొలి నుంచి టికెట్ ఆశించిన డాక్టర్ చందు సాంబశివుడును కాదని వేరొకరికి టికెట్ కేటాయించటంపై పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

మంగళగిరి అభివృద్ధే నా ఏకైక లక్ష్యం


లోకేశ్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న జాస్మిన్ అపార్టుమెంట్‌వాసులు

- మంగళగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి నారా లోకేశ్
- కాజాలో అపార్టుమెంట్ వాసులతో సమావేశం

మంగళగిరి, ఏప్రిల్ 22: అన్నీ ప్రాంతాల్లో సమగ్రమైన రీతిలో మౌలికసదుపాయాలు.. అందమైన పార్కులు, ఆటస్థలాలు, ఆరోగ్య కేంద్రాలు, యువతకు ఉపాధి ఉద్యోగవకాశాలు.. ఎటు చూసినా ఆహ్లాదకరమైన వాతావరణం... ఇదే.. నా మంగళగిరి అభివృద్ధి విజన్! మళ్లీ చెబుతున్నా.. దేశం మొత్తంమీద అభివృద్ధికి కేరాఫ్‌గా మంగళగిరి వుంటుందని స్థానిక టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉదయం ఆయన కాజలోని ఏఆర్ అపార్టుమెంట్, జాస్మిన్ అపార్టుమెంట్ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా మురుగుడు హనుమంతరావు కుటుంబానికి, ఆళ్ల రామకృష్ణారెడ్డికి మీరు అవకాశమిచ్చారు. కానీ ఇక్కడి ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పూ రాలేదు. ఒక్క పరిశ్రమ రాలేదు. ఒక్కరికీ ఇంటిపట్టాను ఇవ్వనూ లేదు. నాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి... మంగళగిరి రూపురేఖలు మారుస్తా.. ఇక్కడి ప్రజల జీవితాల్లోకి వెలుగులు తీసుకొస్తానంటూ లోకేశ్ హామీనిచ్చారు. నేను గతంలో ఇక్కడ ఓడినా ప్రజల కోసం 29 రకాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాను. టీపీఓ కంపెనీని తీసుకొచ్చి 150 మందికి ఉద్యోగాలను ఇప్పించాను. ఇక ఎమ్మెల్యేగా అవకాశమిస్తే మంగళగిరిని ఏస్థాయిలో అభివృద్ధి చేస్తానో మీరే వూహించుకోవాలన్నారు. మంగళగిరి అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని చెప్పారు. మంగళగిరిలో బ్లాక్ మోడల్ అభివృద్ధిని తీసుకొస్తానన్నారు. నియోజకవర్గ మంతటా భూగర్భ డ్రైనేజీల నిర్మాణం.. ఇంటింటికి శుద్ధి చేసిన కృష్ణాజలాల పంపిణీ, జోన్ మోడల్‌లో పెద్దపెద్ద పార్కులు, ఆటస్థలాలు, ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తామని లోకేశ్ వివరించారు.

మంగళగిరిలో చేనేత తరువాత ఎక్కువమంది యువత స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారిని ఆదుకోవల్సిన బాధ్యత తనపై వుందన్నారు. మంగళగిరిలో అతిపెద్ద గోల్డ్ హబ్‌ను ఏర్పాటుచేయడం ద్వారా స్వర్ణకార వృత్తిదారుల తలరాతలను మార్చివేస్తానన్నారు. 50నుంచి వంద ఎకరాల్లో ఈ గోల్డ్‌హబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. దీనివలన 30 వేలనుంచి 40 వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని లోకేశ్ వివరించారు. తనిష్క్, జోయాఅలుక్కాస్ వంటి పెద్దపెద్ద జ్యూయలరీ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని వారికి కావల్సిన ఆభరణాలను ఇక్కడే తయారుచేయిస్తాం. ల్యాబ్ డైమండ్స్ తయారీని కూడ ప్రోత్సహిస్తామని చెప్పారు. ఆభరణాల తయారీ అంటే మంగళగిరి గుర్తుకొచ్చేలా ఈ గోల్డ్‌హబ్‌ను అభివృద్ధి చేస్తామని వివరించారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరికి అనేక ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చామని లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాబోయే కూటమి ప్రభుత్వంలోనూ ఐటీ పరిశ్రమలను మరిన్నింటిని మంగళగిరికి తీసుకువస్తామన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య, బెస్ట్ ఎవైలబుల్ స్కూల్స్ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. విద్యాదీవెన పథకం స్థానంలో తిరిగి పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని తీసుకువస్తామన్నారు. ఉద్యోగులకు ప్రతీనెలా 1న జీతాలు అందేలా తమ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ అభివృద్ధిని చూడాలంటే ప్రజలు తనకు అండగా నిలిచి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమాల్లో జనసేన చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంటీఎంసీ జనసేన అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తోట పార్థసారధి, గాదె పిచ్చిరెడ్డి, పల్లబోతుల శ్రీనివాసరావు, జవ్వాది కిరణ్‌చంద్, మాదల రమేష్, నంబూరు రవి, మన్నెం సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

టీడీపీ కార్యాలయానికి నిప్పు


దహనమైన టీడీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న భాష్యం ప్రవీణ్

- నాగిరెడ్డిపాలెంలో దుండగుల దుశ్చర్య
- దహనమైన కార్యాలయాన్ని పరిశీలించిన భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 22: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు టీడీపీ కార్యాలయానికి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు హటాహుటిన కార్యాలయం వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ గురునాథం, క్రోసూరు సీఐ మంగారావు తెల్లవారు జామున నాలుగు గంటలకు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి మాట్లాడుతూ కావాలనే వైసీపీ నాయకులు టీడీపీ కార్యాలయాన్ని దహనం చేశారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఎంపీ అభ్యర్థి శ్రీ కృష్ణ దేవరాయలు సోదరి రాణి రుద్రమదేవి ప్రచారం నిర్వహిస్తుండగా వైసీపీ నాయకులు వారి ప్రచార రథాలను అడ్డు పెట్టేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఇతర గ్రామాల నుంచి 200 మంది కార్యకర్తలను రప్పించి దాడిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని, టీడీపీ కార్యకర్తలపై రాళ్ళు రువ్వారని తెలిపారు. తెల్లవారు జామున 2గంటల సమయంలో ఎవరూ లేకుండా చూసి పార్టీ కార్యాలయాన్ని దహనం చేయటం ఏంటని? ప్రశ్నించారు. అనంతరం సుమారుగా 9 మందిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఇది పిరికిపంద చర్య : భాష్యం ప్రవీణ్

టీడీపీ కార్యాలయాలను దహనం చేయటం పిరికిపంద చర్య అని పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. బాష్యం ప్రవీణ్, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డితో కలసి దహనమైన కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్రోసూరు పార్టీ కార్యాలయాన్ని దహనం చేశారని, ఇప్పుడు బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం పార్టీ కార్యాలయాన్ని దహనం చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. పెదకూరపాడు వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు వస్తే మస్టర్ ఫ్రీగా వేస్తామని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూలీలకు చెపుతున్నారని భాష్యం ప్రవీణ్ ఆరోపించారు. వెన్నా సాంబశివారెడ్డి మాట్లాడుతూ నాగిరెడ్డిపాలెం గ్రామంలో టీడీపీకి పూర్తి మెజార్టీ వస్తుందనే ఉద్దేశంతో భయభ్రాంతులకు గురిచేయాలనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆయన వెంట రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోర్‌కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, సర్పంచ్ జ్యోతి సముద్రం, గుడిసె కొండయ్య, గుంజా గంగారావు, ఓర్సు ఆనంద్, తమ్మిశెట్టి సత్యనారాయణ, హనుమంతరావు నాయక్, రామకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిధర్‌కు నగర బాధ్యతలు

- ఎమ్మెల్యే అభ్యర్థిగా పీకేశారు..
- ఆర్యవైశ్య సామాజికవర్గం ఓట్ల కోసమేనంటూ విమర్శలు

గుంటూరు, ఏప్రిల్ 22: వైసీపీ నగర అధ్యక్షుడుగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నామినేషన్‌ల తరుణంలో ఎమ్మెల్యే గిరిధర్‌కు నగర అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించటంపై ఆ పార్టీలోనే భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన మద్దాళి గిరిధర్‌ను పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిపి గెలిపించారు. అనంతరం పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే గిరిధర్ వైసీపీలోకి జంప్ చేసిన విషయం తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో కూడా వైసీపీ టిక్కెట్ తనకే వస్తుందని గిరిధర్ ఆశపడ్డారు. చివరకు గిరిధర్‌ని కాదని వైసీపీ అధిష్ఠానం చిలకలూరిపేట నుంచి మంత్రి విడదల రజినీని వైసీపీ అభ్యర్థిగా పశ్చిమ బరిలో నిలపటంపై ఆర్యవైశ్య సామాజిక వర్గీయులు గుర్రుగా ఉన్నారు. పైగా ఇటీవల పార్టీలో ఎమ్మెల్యే గిరిధర్‌కు ప్రాధాన్యత కూడా తగ్గుతోందని ప్రచారం జరుగుతోంది. దాదాపు మూడేళ్ళ నుంచి వైసీపీ నగర అధ్యక్ష పదవి ఖాళీగానే ఉంటోంది. ఎన్నికల సమయంలో హఠాత్తుగా ఎమ్మెల్యే గిరిధర్‌కు నగర అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించి ఆ వర్గం ఓట్లు పొందేందుకు కొత్త ఎత్తుగడగా పార్టీలోని కార్యకర్తలే గుసగుసలాడుకుంటున్నారు. ఈ సందర్భంగా నగర పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌కు ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి, తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, డీసీసీబీ చైర్మన్ రాతంశెట్టి రామాంజినేయులు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) పలువురు శుభాకాంక్షలు తెలిపారు.


క్షతగాత్రులను పరామర్శించిన కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

టీడీపీ కార్యకర్తలపై దాడి

- ముగ్గురికి తీవ్రగాయాలు .. పరామర్శించిన కన్నా

సత్తెనపల్లి, ఏప్రిల్ 22: టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచిన ఘటన మండలంలోని పెద మక్కెన-పెదకూరపాడు మధ్యలోగల పెట్రోల్‌బంకు వద్ద సోమవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ నామినేషన్ కార్యక్రమానికి తరలి వచ్చేందుకు పెద మక్కెనకు చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నేతలు మత్తుపల్లి మేరి బాబు, నాగరాజు, మత్తుపల్లి సంగీతరావు, జరుగుమల్లి ఏసయ్య, దిడ్ల పెద నాగరాజు, అనిల్ తదతరులు సమీపంలోని పెట్రోల్ బంకుకు వెళ్ళారు. అక్కడ జైబాలయ్య.. టీడీపీ వర్ధిల్లాలం టూ నినాదాలు చేశారు. ఆ సమయంలో పెదకూర పాడు వైసీపీ నామినేషన్‌కు వెళ్తున్న వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయి టీడీపీ కార్యకర్తలపై రాళ్ళు కర్రలతో దాడిచేశారు. స్థానికులు వారిని సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కన్నా లక్ష్మీనారాయణ, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు తదితరులు వైద్యశాలకు వెళ్ళి క్షతగాత్రులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

అమరావతి నమూనాల పరిరక్షణకు చర్యలు

తుళ్లూరు,ఏప్రిల్22: అమరావతి నమూనాల పరిరక్షణకు సీఆర్‌డీఏ లోని ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయటం జరిగింది. ఈ బృందం అమరావతి ప్రాంతంలో క్షేత్రస్థాయిలో సందర్శిస్తారు. సీఆర్‌డీఏకు సంబంధించిన నమూనాలను నిరంతరం తనిఖీ చేస్తారు. ఉద్దండ్రాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన చేసిన ప్రదేశంలో ప్రత్యేక సెక్యూరిటీ గార్డులను నియమించి అక్కడ నమూనాల పరిరక్షణకు ప్రత్యేకచర్యలు చేపట్టామని ఏపీ సీఆర్‌డీఏ కమీషనర్ వివేక్ యాదవ్ తెలిపారని కార్యలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

పెదనందిపాడు, ఏప్రిల్, 22: గుంటూరు పర్చూరు రహదారిలోని వరగాని వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ప్రత్తిపాడు మండలం వంగిపురం గ్రామానికి చెందిన వి. విమలబాబు వరగానికి ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వాహనం ఢీకొట్టింది. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా ఎస్‌ఐ రాజ్‌కుమార్ అక్కడకు చేరుకొని క్షతగాత్రుడిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

తుమ్మకోటలో వివాహిత దారుణ హత్య

రెంటచింతల, ఏప్రిల్ 22: మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైన ఘటన సోమవారం వేకువ జామున జరిగింది. కారంపూడి సీఐ బి.చినమల్లయ్య, ఎస్‌ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ప్రకారం.. ఆదివారం తుమ్మకోటలో విఘ్నేశ్వరుని ఆలయ ప్రతిష్ఠతో పాటు బంధువుల ఇంట వివాహ వేడుకలకు కుంకలకుంట్ల భారతి (43) తన కుమారుడు మధు ప్రశాంత్, కూతురు లక్ష్మీ ప్రసన్నతో కలిసి నరసరావుపేట నుంచి వచ్చింది. భర్త శివప్రసాద్ నరసరావుపేటలోనే ఇతర వేడుకకు వెళ్లారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకు భోజనాలు వడ్డించారు. రెండు గంటల సమయంలో ఆరు బయట నిద్రకు ఉపక్రమించగా పిల్లలు మాత్రం వేరే గదిలో పడుకున్నారు. తెల్లవారుజామున లేచి చూడగా భారతి తల ఛిద్రమై విగత జీవిగా పడివుంది. సమీపంలో వ్యవసాయ పనులకు ఉపయోగించే మేడి కర్రతో తీవ్రంగా కొట్టగా దిండంతా రక్తంతో తడిసి పోయింది. సంఘటనా స్థలాన్ని గురజాల డీఎస్పీ పల్లపురాజు పరిశీలించారు. క్లూస్ టీం,డాగ్ స్క్వాడ్‌లు రంగ ప్రవేశం చేశాయి. కుమారుడు మధు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


వినుకొండలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు, జీవీ ఆంజనేయులు

కూటమి అభ్యర్థులకే బీసీల మద్దతు

- ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట టౌన్, వినుకొండ, ఏప్రిల్ 22: భావితరాల భవిష్యత్ కోసం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. సోమవారం నరసరావుపేట, వినుకొండలో కేసన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం సంక్షేమమే కాకుండా అభివృద్ధి జరగాలన్నారు. రాజధాని లేని అనాథ రాష్ట్రంగా మిగిలిపోయిందన్నారు. రాష్ట్రంలో బీసీలపై అత్యాచారాలు, దాడులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఐదేళ్ళుగా జరుగుతున్న వైసీపీ అరాచకాలు చూస్తూ బీసీ సంక్షేమ సంఘం కూటమి అభ్యర్థులకు మద్దతు పలుకుతున్నారని అన్నారు. ఈ అవినీతి, దుర్మార్గ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. రాష్ట్రం మొత్తం మీద 3వేల బీసీల మీద దాడులు జరిగాయని, పల్నాడు జిల్లాలో 26 మందిని హత్యచేశారని అన్నారు. నరసరావుపేట పట్టణంలో వరవకట్టకు చెందిన ఇబ్రహీం అనే ముస్లిం వ్యక్తిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కనుసన్నల్లో హత్యచేశారని అన్నారు. అలవాలలో వెన్నా బాలకోటిరెడ్డిని హత్యచేశారని అన్నారు.

వినుకొండలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీలకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని స్పష్టంగా చెప్పారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బీసీ డిక్లేరేషన్‌లో పెట్టిన అన్నింటిని అమలు చేయించుకోవాలంటే కూటమిని గెలిపించుకోవాలన్నారు. ఆయా సమావేశాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, బాదుగున్నల శ్రీను, తన్నీరు ఆంజనేయులు, నాగమల్లేశ్వరరావు, న్యాయవాది సైదారావు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈతకు దిగి ముగ్గురు యువకుల మృతి

- తుర్లపాడు మేజరు కాలువ వద్ద ఘటన
- మృతులు ములకలూరువాసులు

నాదెండ్ల / నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 22: మండలంలో ప్రవహిస్తున్న తుర్లపాడు మేజరు కాలువలో ఈతకు దిగి ముగ్గురు యువకులు మృతి చెందారు. కాలువ పక్కనే ఉన్న రోడ్డుపై మోటారు బైక్, చెప్పులు, దుస్తులను గుర్తించటంతో పాటు కాలువలో తేలాడుతున్న మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించటంతో ఈవిషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ ఉన్న వస్తువులు ప్రకారం మృతదిచెందిన ముగ్గురు నరసరావుపేట మండలంలోని ములకలూరు గ్రామస్తులుగా గుర్తించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములకలూరు గ్రామానికి చెందిన చలమల రాజు(20), గేరా పురుషోత్తం(20), బోరుగడ్డ ఆకాష్‌లు(21)లు ఒకే మోటారు సైకిల్‌పై ఆదివారం ఎండుగుంపాలెం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో కనపర్రు - సాతులూరు గ్రామాల మధ్య తుర్లపాడు మేజరు కాలువలో ఈతకు దిగారు. ఈత కొడుతూ ముగ్గురు గల్లంతయ్యారు. సోమవారం నీటి ప్రవాహం తగ్గటంతో తేలి యాడటంతో ఒక మృతదేహాన్ని గుర్తించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో మిగిలిన రెండు మృతదేహాలను కాలువలో నుంచి వెలికి తీశారు. రాజు సెక్యూరిటీ గార్డుగా, ఆకాష్ కార్పెంటర్‌గా పనిచేస్తుండగా పురుషోత్తం ఇంటర్ పూర్తిచేశాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు అవివాహితులు కాగా.. స్నేహితులు కూడా కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మరోసారి మోసపోయేది లేదు

- 1588వ రోజుకు చేరుకున్న ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 22: అధికారంలోకి రాక ముందు నుండే సీఎం జగన్‌రెడ్డి అమరావతి రాజధానిపై కక్షపెంచుకున్నాడని 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్,మూడు రాజధానులొద్దు అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1588వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పైకి మాత్రం అమరావతిని స్వాగతిస్తున్నాను.. విజయవాడ గుంటూరు మధ్య 30వేల ఎకరాలు రాజధానికి అవసరమవుతుందని చెప్పిన జగన్‌రెడ్డి సీఎంగా అందలం ఎక్కగానే అమరావతిని నాశనం చేయటమే ధ్యేయంగా పెట్టుకున్నాడన్నారు. అమరావతితో పాటు రాష్ట్రాభివృద్ధిని కూడా కుంటు పరిచిన జగన్‌రెడ్డిని ఇంటికి పంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు.


అత్యధిక మార్కులు సాధించిన దీపికాశ్రీ, విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

నిరంతర పర్యవేక్షణతోనే అత్యున్నత ఫలితాలు

- భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య),ఏప్రిల్22: విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతో పాటు నిరంతర పర్యవేక్షణ కారణంగా భాష్యం విద్యాసంస్థల్లో అత్యున్నత ఫలితాలు సాధ్యం అయ్యాయని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ వెల్లడించారు. పదిలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన సోమవారం గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థిని జి.దీపికాశ్రీ 597లతో అగ్రస్థానంలో నిచినట్లు తెలిపారు. ఇంకా కె.వెంకట సాయిభావన 596, వైషరీనా 596 మార్కులు సాధించారని వివరించారు. తమ విద్యార్థిని ఎస్.గాయత్రి 595, కె.లక్ష్మీహంసిని 595, ఎస్.ఆశ్రిత 596 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. కాగా తమ విద్యార్థులు 590 పైగా మార్కులను 90మంది, 580 పైగా 588, 670 ఆ పైగా 1299, 550పైగా మార్కులు 2,809 మంది, 500 ఆ పైగా మార్కులు 5,783 మంది సాధించారన్నారు. ఇక గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1,113 మంది, 95 పైగా సాధించిన వారు 3627 మంది, 90 పైగా సాధించిన వారు 5103 మంది ఉన్నారని వెల్లడించారు. అదే విధంగా సైన్స్‌లో 100కు 100 సాధించిన విద్యార్థులు 251 మంది, 95పైగా మార్కులు 2117 మంది, 90 పైగా 4016 మంది సాధించారని వివరించారు. విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు తదితరులు అభినందించారు.

93,891 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 95,448 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 93,891 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 60,589 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16500
నెంబరు. 5	9000	11500
273	12000	13500
341	8500	16000
4884	11000	13500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8000	13500
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ ప్రమీలా గురవారెడ్డి

ప్రజలకు సేవ చేసేందుకే వచ్చా..

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, ఏప్రిల్ 22: తాను మీ సేవకుడిగా పనిచేస్తానని, మీరు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని, మనందరిదీ టీడీపీ కుటుంబమని, ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనేది మా రక్తంలో లేదని, ఎవరికి ఎటువంటి అవసరమొచ్చిన తాను ముందుంటానని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని మిట్టగుడిపాడులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు వీర తిలకం దిద్ది, గుమ్మడికాయలతో దిష్టి తీసి బాణాసంచా మోతతో దద్దరిల్లేలా గ్రామంలోకి సాదరంగా ఆహ్వానించారు. తన తల్లిదండ్రులు మూడు దఫాలుగా ఎమ్మెల్యేలుగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశారని, తాను కూడా వారి మార్గంలో పయనిస్తానన్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన 31 కుటుంబాలు బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వీరిలో విశ్రాంత వీఆర్వో గొట్టం సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ గొట్టం ప్రమీలా గురవారెడ్డి, అరికట్ల సతీష్‌రెడ్డి, పేరయ్య, జోసఫ్, బాలేసాహెబ్, మస్తాన్‌వలి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, పల్లెర్ల లక్ష్మారెడ్డి, కాయితి రవికృష్ణారెడ్డి, కనకయ్య, గోగుల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

మాచర్లటౌన్: మండలంలోని భైరవునిపాడు గ్రామానికి చెందిన 50 రెడ్డి సామాజికవర్గ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గోగిరెడ్డి మల్లారెడ్డి, కోటిరెడ్డి, వలపారెడ్డి, తీగూరి వెంకటేశ్వరరెడ్డి, బోయ మల్లారెడ్డి, అంజిరెడ్డి, శివారెడ్డి, ఆళ్ల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు. వీరంతా బోయ గోపిరెడ్డి (ఖలీల్), మద్దిగపు పెదవెంకటరామిరెడ్డిల ఆధ్వర్యాన టీడీపీ కండువా కప్పుకున్నారు.

మండలంలోని జమ్మలమడకకు చెందిన వార్డు మెంబర్, వైసీపీ నేత చిన మల్లయ్య ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ గొబ్బూరి సుబ్బయ్య ఆధ్వర్యాన ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

టీడీపీ వస్తేనే మహిళలకు న్యాయం

కూటమి అధికారంలోకి వస్తేనే ప్రతి మహిళకు న్యాయం జరుగుతుందని, ఇదే మాట ప్రతిచోటా వినిపిస్తోందని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. సోమవారం పట్టణంలోని 19, 20వ వార్డుల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ 6 పథకాలను వివరించారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు శ్రీకృష్ణదేవరాయలు, బ్రహ్మారెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జూలకంటి నాగార్జునరెడ్డి, కుమారి, అనురాధ, శాంతి, నాగలక్ష్మి, దుర్గ, మంగమ్మ, లాల్ కృష్ణ, వినోద్, లక్ష్మణ్, బత్తిన గణేష్, బీమవరపు శ్రీను, మాచర్ల వాసు, పుల్లారావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ కార్యకర్తలపై దాడి

అమరావతి, ఏప్రిల్ 22: రానున్న ఎన్నికలలో ఓటమి భయంతో వైసీపీ కార్యకర్తలు పెట్రేగి టీడీపీ కార్యకర్తలపై, టీడీపీ ప్రచార వాహనాలపై దాడులు చేస్తున్నారని జిల్లా తెలుగు రైతునేత వసంతరావు అన్నారు. నంబూరు శంకరరావు అనుచరులు పెదకూరపాడు పెట్రోలుబంక్ వద్ద మక్కెన గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలపై, అలాగే 75త్యాళ్లూరు, బెల్లంకొండ వద్ద టీడీపీ ప్రచార వాహనంపై దాడి చేశారని, ఈ దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇలాంటి పార్టీకి తిరిగి అధికారం ఇస్తే రాష్ట్రంలో అరాచకవాదులు పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. రెండు ఘటనలకు కారణమైన వారిపై కేసునమోదు చేసి శిక్షించాలని పోలీసులను కోరారు. వైసీపీ దాడులను జనసేన మండల ఉపాధ్యక్షుడు రాయిసత్యనారాయణ తీవ్రంగా ఖండించారు.

'పది' ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

మాచర్లరూరల్,ఏప్రిల్ 22: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 78.20శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెయింట్ ఆన్స్ విద్యార్థిని జే.అమూల్య 575 మార్కులతో ప్రథమంగా నిలిచింది. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎస్‌కే షాహిన్ 572 మార్కులతో ద్వితీయంగా నిలిచింది. మొత్తంగా 919 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 719 మంది ఉత్తీర్ణత సాధించారు.

విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 78 మంది పరీక్ష రాయగా 76 మంది ఉత్తీర్ణులయ్యారు. నీలం అజయ్‌కుమార్ 571 మార్కులతో ప్రథమంగా నిలిచాడు. 97శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే పీటీజీ స్కూల్లో 53 మందికిగాను 50, సోషల్‌వెల్ఫేర్‌లో 99 మందికి 97 మంది ఉత్తీర్ణులయ్యారు. శైలజ 554 మార్కులు సాధించింది.

నకరికల్లు: కండ్లకుంట జడ్పీ హైస్కూల్‌కు చెందిన మేకా దీపిక 581 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. దేవవరం మోడల్ స్కూల్ విద్యార్థినులు జే.కావ్యాబాయి 567, కే.గాయత్రి 549, చేజర్ల జడ్పీ స్కూల్ విద్యార్థిని ఎం.శ్రీవిద్య 564, కుంకలగుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం గోపీ కిరణ్‌రెడ్డి 552, గుండ్లపల్లి హైస్కూల్ విద్యార్థి షేక్ చింతపల్లి మీరాజ్ 552, దేచవరం మోడల్ స్కూల్‌కు చెందిన సాధించినట్లు ఎంఈవో తెలిపారు. కుంకలగుంట జడ్పీ హైస్కూల్ 96.67 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలువగా, దేచవరం మోడల్‌స్కూల్, చేజర్ల జడ్పీ హైస్కూల్, నకరికల్లు కేజీబీవీ పాఠశాలలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

వెల్దుర్తి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 64శాతం ఉత్తీర్ణతనమోదైంది. మొత్తం 404 మంది పరీక్షలకు హాజరుకాగా 258మంది ఉత్తీర్ణత సాధించారు. గుండ్లపాడు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని స్వప్నబాయి 565, శిరిగిరిపాడు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పి.అనురాధ 564, కండ్లకుంట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎస్ గాయత్రి 562 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

అమరావతి: 10వ తరగతి పరీక్షా ఫలితాలలో మండల పరిధి లోని జిల్లా పరిషత్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో 85 శాతం ఉత్తీర్ణత నమోదై నట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. అత్యధికంగా శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో 96 శాతం, అత్యల్పంగా మల్లాది జడ్పీ ఉన్నత పాఠశాలలో 44 శాతం ఉత్తీర్ణత సాధించారు. మునగోడు పాఠశాలకు చెందిన షేక్ అహ్మద్ 565, బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎన్.విజయలక్ష్మి 551మార్కులతో మొదటి ద్వితీయ స్థానాలలో నిలిచారు.

అచ్చంపేట: పది ఫలితాల్లో మండలంలో 88 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఎంఈవో రావిపాటి నరసింహారావు తెలిపారు. మొత్తం 502 మంది పరీక్షలు రాయగా 439 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వేల్పూరు జడ్పీహైస్కూల్ విద్యార్థి సీహెచ్ రత్నవరుణ్ 562 మార్కులు సాధించినట్లు తెలిపారు.

ముప్పాళ్ళ : పది ఫలితాల్లో మండల వ్యాప్తంగా 79 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 319 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 252 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పీ.సాయి తేజశ్రీ 577 మార్కులతో ప్రథమస్థానం, ఏ.రుక్మిణీ 562 మార్కులతో ద్వితీయస్థానం సాధించారని హెచ్‌ఎం నాగేంద్రమ్మ తెలిపారు.

క్రోసూరు: మండలంలో 96 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఎంఈవో ఏకుల ప్రసాదరావు తెలిపారు. మొత్తం 861 మంది పరీక్షలకు హాజరు కాగా 825 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బయ్యవరం, 88 తాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూళ్ళు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఊటుకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఏ మేఘన 584, బయ్యవరం హైస్కూల్ విద్యార్థి జీ.విష్ణువర్ధన్ 575, అదే పాఠశాలకు చెందిన టీ.వసంత లక్ష్మి 571 మార్కులతో తొలి మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. దొడ్లేరు హైస్కూలు 92 శాతం, క్రోసూరు మోడల్ స్కూల్ 98 ఉత్తీర్ణత నమోదు చేసిందని తెలిపారు.

దాచేపల్లి: మండలంలో 85.8 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఎంఈవో పినాకపాణి తెలిపారు. మొత్తం 877 మంది పరీక్షలకు హాజరుకాగా 753 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. తెలుగు మీడియంలో గామాలపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గాయత్రి 565 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. తహసీల్దార్ గీతావాణి, ఎంపీడీవో వెంకటరమణ ఇతర అధికారులు విద్యార్థులను అభినందించారు.

సత్తెనపల్లి : మండలంలోని వెన్నాదేవి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 17 మంది పరీక్షలకు హాజరుగాకా 16మంది ఉత్తీర్ణత సాధించారు. జీ.గుణ 518, ఎం.పూజిత 517 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మాచవరం : మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని దేరంగుల యామిని 585 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మోర్జంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివిన కోట హారిక 581 మార్కులు సాధించి 3వ స్థానంలో నిలిచింది. మండలం మొత్తం మీద 86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

మీవాడిని.. మీలో ఒకడిని..

● ఏ ఆపద వచ్చినా మీకు నేనున్నాను..
● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు
● 50వేల మందితో ఉత్సాహంగా నామినేషన్ ర్యాలీ..
● మండుటెండను లెక్కచేయని గురజాల ప్రజలు
● హజరైన ఎంపీ లావు, ఎమ్మెల్సీ జంగా, కూటమి నేతలు



కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం చేస్తున్న అభ్యర్థి యరపతినేని

గురజాలటౌన్, ఏప్రిల్ 22: కాసు అక్రమాలకు తెరపడే రోజులు దగ్గరలో వున్నాయి. గురజాలలో దోచుకొని నరసరావుపేటలో దాచుకుంటున్న నేత కావాలా... మీ మధ్యనే వుంటూ మీలో ఒకడిగా, ఏ ఆపద వచ్చినా నేనున్నాననే భరోసా ఇస్తున్న యరపతినేని కావాలో ఆలోచించుకోవాలని గురజాల కూటమిఅభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం గురజాలలో నామినేషన్ దాఖలు కార్యక్రమం కోలాహలంగా జరిగింది. పిడుగురాళ్ల పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ మొదలై గురజాలవరకు సాగింది. మధ్యలో గంగమ్మ తల్లి దేవాలయం, భోళాలింగేశ్వర స్వామి గుడి, చర్చి, కనకదుర్గ అమ్మవారి గుడి, మసీదు, అయ్యప్ప దేవాలయంలలో యరపతినేని పూజలు నిర్వహించారు. నామినేషన్ కార్యక్రమంలో యరపతినేనితో పాటు ఎమ్మెల్సీ జంగాకృష్ణమూర్తి, నంద్యాల ధనుంజయరెడ్డి, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, న్యాయవాది సూర్యరాజు హాజరయ్యారు. నియోజకవర్గ నలుమూలల నుండి హాజరైన సుమారు 50 వేల మందితో గురజాల పట్టణం పసుపుమయమైంది.

అనంతరం ప్రచారరథంపై నుండి హాజరైన పార్టీ శ్రేణులు, కార్యకర్తలనుద్దేశించి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అభివృద్ధి కావాలంటే తెలుగుదేశంకు, అరాచకం కావాలంటే వైసీపీకి ఓటు వేయాలన్నారు. గురజాల ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషిచేయడమే కాకుండా ఈప్రాంత రైతులు సస్యశ్యామలంగా పంటలు పండించాలంటే సాగర్ జలాలు తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లకాలంలో గురజాలలో కాసు మహేష్‌రెడ్డి చేయించిన అక్రమాలతో కోట్లు గడించారన్నారు. 2019లో ఎమ్మెల్యే అయిన కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోగా అన్నివర్గాలపై దాడులుచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధిపై గొడ్డలి పెట్టులా మారాడన్నారు. అక్రమ సంపాదన కోసం ఎనిమిది మంది చిన్నారులు, 11 మందిని పొట్టన పెట్టుకున్న కాసు మహేష్‌రెడ్డికి గురజాలలో ఓటు అడిగే అర్హత లేదన్నారు. ఐదేళ్లు ఓపికతో వున్న ప్రజలు ఈసారి కాసు మహేష్‌రెడ్డిని సాగనంపేందుకు సిద్ధంగా వున్నారన్నారు. గురజాల ప్రజల ఆదరాభిమానాలతో చంద్రబాబు ఆశీస్సులతో 7వసారి తాను గురజాలలో పోటీచేస్తున్నానని, ఈ ఎన్నికలు వైసీపీ అరాచకానికి, టీడీపీ అభివృద్ధికి మధ్య జరుగుతున్నవని గుర్తుచేస్తూ అభివృద్ధి, సంక్షేమం అందరికీ చెందాలంటే సైకిల్‌గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆత్మాభిమానం వున్న వారెవరూ వైసీపీలో కొనసాగరని, తనను పార్టీ నుండి బయటకు పంపేదాకా కొందరు నేతలు పనిగట్టుకున్నారని, అక్కడి నేతల వ్యవహార శైలి, ఆత్మగౌరవం చంపుకొని వుండలేకే బయటకు వచ్చానని కృష్ణమూర్తి అన్నారు. గురజాల ప్రముఖ వైద్యులు చల్లగుండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ గురజాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలును, ఎమ్మెల్యేగా యరపతినేని శ్రీనివాసరావును గెలిపించేందుకు ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. తెలంగాణ టీడీపీ నేత నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ జగన్ అడిగిన ఒక్క చాన్స్ అయిపోయిందని, రెండవ చాన్స్ ఇమ్మని అడిగే హక్కు జగన్‌కు లేదన్నారు. ర్యాలీలో పులుకూరి కాంతారావు, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, కటకం అంకారావు, అడపా శ్రీను, బెల్లంకొండ భద్రి, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఆత్మకూరి కాశీ, యేలూరి శశి, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలిన నాయకులు, అభిమానులు

దాచేపల్లి : యరపతినేని నామినేషన్ కార్యక్రమానికి దాచేపల్లి మండలం నుండి వేలాదిగా తరలివెళ్లారు. సోమవారం దాచేపల్లిలోని ప్రధాన వీధులగుండా భారీ ర్యాలీ నిర్వహించారు. కేశానుపల్లి, తక్కెళ్లపాడు, పెదగార్లపాడు, తంగెడ, ముత్యాలంపాడు, నడికుడి, రామాపురం, మాదినపాడు, గామాలపాడు గ్రామాల నుండి 10వేల మందికిపైగా ప్రజలు వివిధ వాహనాలలో భారీగా తరలివెళ్లారు.



నామినేషన్ కార్యక్రమానికి హాజరైన పార్టీ శ్రేణులు, జనసందోహం



దాచేపల్లి దేవాలయంలో యరపతినేనికి హారతులిస్తున్న మహిళలు

వైసీపీ అరాచక పాలనకు చెక్ పెడదాం

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 22 : వైసీపీ అరాచక పాలనకు చెక్ చెప్పి ఎన్డీఏ కూటమిని గెలిపించి చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేసుకుందామని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం తన నామినేషన్ కార్యక్రమం అనంతరం కన్నా విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర, రాజధాని భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎన్డీఏ కూటమిని అధికారం లోకి తీసుకు రావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలందరిపై ఉందన్నారు. తన నామినేషన్ కార్యక్రమానికి నియోజక వర్గం నుంచి వేల సంఖ్యలో తరలి వచ్చిన జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలను, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, టీడీపీ నేతలు ఎలినేడి రామ స్వామి, చౌట శ్రీనివాసరావు, నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీచౌదరి, బత్తుల వెంకటస్వామి, ఆతుకూరి నాగేశ్వర రావు తదితరులు ఉన్నారు. ముందుగా జరిగిన నామినేషన్ కార్యక్రమంలో వీరిపాటు టీడీపీ రాష్ట్ర నేత డాక్టర్ కోడెల శివరాం, నేతలు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, తాతా జయ ప్రకాష్ నారాయణ, జనసేన నేతలు కొమ్మిశెట్టి సాంబశివరావు, తవిటి భవన్నారాయణ, శిరిగిరి శ్రీనివాసరావు, బీజేపీ పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు నియోజకవర్గానికి చెందిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మాల మహానాడు నేతలు ఈమని చంద్రశేఖర్, కొర్రపాటి సురేష్ తదితరులు కన్నాను ఘనంగా సన్మానించారు.



నామినేషన్‌వేసుందుకు ప్రత్యేక రథంపై వెళుతున్న కన్నా లక్ష్మీనారాయణ

కన్నాను సన్మానించిన డాక్టర్ కోడెల

టీడీపీ నేత డాక్టర్ కోడెల శివరామ్ సోమవారం కన్నాను ఆయన గృహంలో కలిశారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా కన్నాను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ ఘటన టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఇప్పటి వరకు కన్నాకు దూరంగా ఉంటూ వస్తున్న కోడెల శివరామ్ కన్నాను కలవడంతో నియోజకవర్గంలో టీడీపీ విజయం తథ్యమని కోడెల శివరామ్ అభిమానులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు అంటున్నారు.



కన్నా లక్ష్మీనారాయణను దుశ్శాలువాతో సత్కరిస్తున్న కోడెల శివరామ్



పసుపు కండువాలు, టోపీలు ధరించి ర్యాలీలో పాల్గొన్న మహిళలు

చంద్రబాబుకి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్
● వైసీపీని వీడి టీడీపీలోకి పలువురి చేరిక



బెల్లంకొండలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 22 : అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకు రెండు కళ్ళు లాంటివని పెదకూర పాడు ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని పాపాయపాలెం, న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌కు చెందిన 40 కుటుంబాలు ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో తీర్థం పుచ్చుకున్నారు. ఈ సదర్భంగా ప్రవీణ్ మాట్లా డుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నియోజకవర్గ ఎస్సీసెల్ నేత హనుమంతరావునాయక్, తెలుగు మహిళా అధ్య క్షురాలు నాగమణిబాయి, ప్రసాదు, శ్రీనివాసరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

90 కుటుంబాలు టీడీపీలో చేరిక

అచ్చంపేట: మండలకేంద్రమైన అచ్చంపేటలోని టీడీపీ కార్యాలయంలో ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన 90 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎస్టీలకు చెందిన 40 కుటుంబాలు, ఎస్సీలకు చెందిన మాలపల్లి 50 కుటుంబాలను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి భాష్యం ప్రవీణ్ ఆహ్వానించారు. అలాగే ఎస్సీ మాల పల్లెకు చెందిన 50 కుటుంబాలు స్థానిక టీడీపీ నాయకుడు వెనిగండ్ల కోటయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.


అమరావతి : మండల పరిధిలోని అత్తలూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు తిప్పాబత్తిన ఇన్నయ్య ఆపార్టీని వీడి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు గంట రాజేష్, బెల్లంకొండ ఇన్నయ్య పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళాభివృద్ధి సాధ్యం

క్రోసూరు: రాష్ట్రంలో మహిళలు ఆర్థికస్వావలంబన సాధించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య అన్నారు. సోమవారం రాత్రి దొడ్లేరులో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాల గురించి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణ దేవరాయలను, పెదకూరపాడు ఎమ్మెల్యేగా భాష్యం ప్రవీణ్‌ను గెలిపించాలని ఆమె కోరారు. ఆమె వెంట పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



అచ్చంపేటలో టీడీపీలో చేరినవారితో భాష్యం ప్రవీణ్



క్రోసూరు మండలం దొడ్లేరులో ఎన్నికల ప్రచారంలో భాష్యం లావణ్య



గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్

వెల్దుర్తి, ఏప్రిల్ 22: ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ అన్నారు. సోమవారం మాచర్ల నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్యాంప్రసాద్‌తో కలిసి మండలంలోని గుండ్లపాడు, కొత్తపుల్లారెడ్డిగూడెంలలో ఆయన పర్యటించారు. ఆయా చోట్ల గ్రామస్తులతో శివశంకర్ మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● ఎస్పీ బిందు మాధవ్ ● సమస్యాత్మక గ్రామాల్లో పర్యటన

అమరావతి, ఏప్రిల్ 22 : ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన నరుకులపాడు, లింగాపురం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు శాంతి భద్రతలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఐదవ రోజు నామినేషన్లు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 22: గురజాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థులుగా సోమవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కూటమి అభ్యర్థిగా యరపతి నేని శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేయగా, వైసీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి తరుపున కలకండ అంద్రయ్య ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అఖిల జనసంఘ్ పార్టీ అభ్యర్థిగా నీరుమళ్ల శ్రీనివాసరావు నామినేషన్ పత్రాలను గురజాల ఆర్వో రమాకాంత్‌రెడ్డికి అందజేశారు.

పెదకూరపాడు : పెదకూరపాడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నంబూరు శంకరరావు సోమవారం నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కందుల శ్రీరాములుకు అందించారు. స్వతంత్ర్య అభ్యర్థులుగా శెట్టి సింగారయ్య, నంబూరు కళ్యాణ చక్రవర్తి, నంబూరు వసంత కుమారి, ఎండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థి షేక్ యూనస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పమిడి నాగేశ్వరరావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివరించారు.

టీడీపీ కార్యాలయ దహనం పిరికిపంద చర్య

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 22 : బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో టీడీపీ కార్యాలయాన్ని వైసీపీ శ్రేణులు దహనం చేసిన ఘటనపై టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ స్పందిస్తూ.. దాన్ని పిరికి పంద చర్యగా అభివర్ణించారు. టీడీపీపై ప్రజలలో వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక వైసీపీ మూకలు ఇటువంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. ఇటీవల క్రోసూరు టీడీపీ కార్యాలయాన్ని తగలబెట్టిన విషయం మరవకముందే బెల్లంకొండ మండల అదే తరహాలో ఘటనకు పాల్పడటం నీచమన్నారు. అధికార పక్షానికి ఓటమి కళ్ళముందు కనిపించడంతో ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైసీపీ వారికి ఎన్నికల కోడ్ వర్తించదా ?



తహసీల్దార్ కార్యాలయంలో నిలిపివున్న అంబటి రాంబాబు సతీమణి వాహనం

సత్తెనపల్లి ఏప్రిల్ 22: మంత్రి అంబటి రాంబాబు, ఆయన కుటుంబ సభ్యులు సోమవారం ఎన్నికల కోడ్‌ను ఉల్లంగించారు. సోమవారం నామినేషన్ దాఖలు చేయడానికి అంబటి రాంబాబు, ఆయన సతీమణి వేరు వేరువాహనాల్లో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థుల, ఇతరుల వాహనాలను కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే నిలిపి ఉంచాలని ఉంది. అయితే అంబటి, ఆయన భార్య వాహనాలు నేరుగా కార్యాలయంలోనికి ప్రవేశించాయి. సోమవారం కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఆ సమయంలో కన్నాతో వచ్చిన వాహనాలను 100 మీటర్ల దూరంలోనే పోలీసులు నిలిపివేశారు. కోడ్‌ను అమలు చేయడంలో పోలీసులు వైసీపీకి ఒకలా, టీడీపీకి మరోలా ప్రవర్తించడంపై కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారితో పాటు, అధికారులపైనా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కూటమి నేతలు స్పష్టం చేశారు.

వైభవంగా ధ్వజారోహణం

మాచర్లటౌన్, ఏప్రిల్ 22: పట్టణంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన సోమవారం ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈవో సాంబయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అమరావతి, ఏప్రిల్ 22: స్థానిక పల్లపు వీధికి చెందిన రాయి తిరుమలరావు వడదెబ్బతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పెదకూరపాడు నియేజకవర్గ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ రూ. 10 వేలను తక్షణ ఆర్థిక సాయంగా అంద జేశారు. ఆ నగదును టీడీపీ, జనసేన నాయకులు రాయి నాగరాజు, భాస్కర్, వీ.వాసు, డీ.నాగేశ్వర రావు, వీరేంద్ర, ఆర్ సత్యనారాయణలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

టీడీపీని గెలిపిద్దాం

అచ్చంపేట, ఏప్రిల్ 22 : రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించాలని ఎన్‌ఆర్‌ఐ మాగులూరి భాను ప్రకాష్ అన్నారు. సోమవారం రాత్రి అచ్చంపేటలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో కోలాటం ఆడుతున్న మహిళలు

నాయకా.. ఏమి నీ అలక..!



- పార్టీకి దూరంగా ఉంటున్న నాయకులపై నేతల దృష్టి
- ట్రబుల్ షూటర్స్‌ను రంగంలోకి దింపుతున్న పార్టీలు
- నయానో భయానో ఒప్పించడానికి ముమ్మరంగా ప్రయత్నాలు
- గతాన్ని గుర్తు చేస్తూ బెట్టు చేస్తున్న నాయికాగణం

బాపట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రకరకాల కారణాలతో పార్టీకి దూరంగా ఉంటున్నవారిని నేతలు ఇన్ని రోజులూ లైట్ తీసుకున్నారు. కానీ ఎన్నికల సమయం కావడంతో వారి అలకలపై ప్రత్యేకంగా రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. వారిని శాంతింపజేసి తిరిగి పార్టీకోసం పనిచేసే విధంగా వారిని ఒప్పించడానికి నిష్ణాతులైన ట్రబుల్ షూటర్స్‌ను నేతలు రంగంలోకి దింపారు. వీరి అండతో వారి అలకలకు విరుగుడు కనుక్కునే కార్యక్రమాన్ని నేతలు ముమ్మరం చేశారు. తృణమో, పణమో ఇచ్చయినా సరే వారిని మళ్లీ పార్టీలో యాక్టివ్ అయ్యేలా చూసి పదోపరకో ఓట్లు పంట పండించుకోవాలి.. ఇదే నేతల తక్షణ కర్తవ్యం.

అప్పుడు పట్టించుకోలేదు...

పార్టీ పరిస్థితిపై నెత్తీనోరు కొట్టుకుని చెప్పినా అప్పుడు వినలేదు. ఇప్పుడు ఎందుకు వచ్చారు. అలకబూనిన ఓ నేత మాటలివి. అప్పుడంటే ఆయన మాటలతో విభేదించారు కానీ ఇప్పుడు ఆ అవకాశం లేదాయే. సదరు నేత చెప్పిన ప్రతి మాటను స్కూల్‌కు వెళ్లే పిల్లాడిలా శ్రద్ధతో ఆలకిస్తున్నారు నేతలు. ఎందుకంటే వచ్చిన పనికావడం ముఖ్యం కనుక. అప్పుడంటే ఎన్నికలు లేవు కనుక పార్టీకి దూరంగా ఉంటానని అలకబూనినా పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడంటే ఎన్నికలు తప్పదు మరీ.

ట్రబుల్ షూటర్స్‌కు డిమాండ్...

ఓ ఊరులోనో, కాలనీలోనే పెద్దమనిషి తరహాలో ట్రబుల్ షూటర్స్‌గా కొంతమంది కీర్తి గడించి ఉంటారు. వీరి అవసరం ఎన్నికల వేళ నేతలకు వచ్చి పడింది. అలకలు, పట్టుదలతో పార్టీకి దూరంగా ఉంటున్న వారిపైకి తొలుత ట్రబుల్ షూటర్స్‌నే ప్రయోగిస్తున్నారు. వారితో మాటామంతీ పూర్తయిన తర్వాత కానీ సదరు అగ్రనేత రంగప్రవేశం జరగడం లేదు. నేరుగా నేతే అలకబూనిన వారి దగ్గరకు వెళితే ముఖానే తలుపు వేస్తే ఎన్నికల వేళ సదరు నేతల పరువు ఏం కానూ.. అందుకు మొదట ట్రబుల్ షూటర్స్ ప్రయోగం.. ఆనక కథానాయకుడు ఎంట్రీతో కథ తిరిగి పార్టీ గూటికి చేరుతోంది.

పదవులు మొదలు.. పైకం వరకూ..

అలకబూనిన నేతలను దారికి తెచ్చుకోవడానికి అప్పుడే నామినేటెడ్ పదవుల పందేరంతో పాటు స్థానిక సంస్థల పదవుల పంపకం కూడా జోరుగా సాగుతోంది. అన్నీ పార్టీల్లో ఇదే తంతు. ఇదెలా సాధ్యం గెలిచేది ఒక్కపార్టీనే కదా.. అందరికీ న్యాయం ఎలా జరుగుతుందనే ధర్మసందేహాలు ఎన్నికల వేళ అసలు రాకూడదు.. గెలిచేసినట్లు.. పదవులు వరించినట్లు నేతలు వారికి అరచేతిలో త్రీడీ సినిమా చూపిస్తారు. వారు దానిని నమ్మి అలకపాన్పు వీడి పార్టీ గెలుపుకోసం పనిచేయాల్సిందే. ఫలితాలు వచ్చాక తర్వాత సంగతి.

అవమానాలను నేతల ముందు ఏకరువు...

ఎన్నికలప్పుడు చూసుకోవచ్చులే అనే ధీమాతో నేతాగణం కూడా దురుసుగా మాట్లాడి చాలామందిని పార్టీకి దూరం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఇప్పుడు గత్యంతరం లేని పరిస్థితుల్లో వారి గడప తొక్కాల్సిన అగత్యం నేతాగణానిది. ఇదే అదనుగా అప్పుడు తమకు ఎదురైన అవమానాన్ని నేతల ఎదురుగానే కడిగిపారేసి తమ ఆక్రోశాన్ని తీర్చేసుకుంటున్నారు అలకబూనిన నేతలు. అంటే అన్నారులేగాని పార్టీలోకి వచ్చి గెలుపు కోసం పని చేస్తే అదే పదివేలు అన్న చందాన నేతలు సర్దుకుపోతున్నారు.

మాకేంటి అనే పంథా కొందరిదీ....

పార్టీపై అభిమానం ఉన్నప్పటికీ దూరం జరిగిన వారు నేతల కొద్దిపాటి బుజ్జగింపు లతోనే ఓ మెట్టు దిగి వెంటనే ప్రచారానిక సై అంటున్నారు. మరి కొంతమంది మా త్రం అలకపాన్పు వీడాలంటే నేతలు కట్నం చదివించాల్సిందే అని పట్టుబడుతున్నారు. అదికూడా మరీ ఎక్కువగా ఉండడంతో నేతలు అవాక్కవుతున్నారు. అలా అని చెప్పి వారి మానాన వారిని అలకలకు వదిలేయలేరు. నయానో భయానో ఒప్పించి మళ్లీ పార్టీ జెండా కప్పి ఓసారి జిందాబాద్ కొట్టించుకుంటేనే నేత మనసు కుదుటపడని పరిస్థితి. ఎందుకంటే ఎన్నికలు సమయం కదా... తప్పదు అలకలు తీర్చాలిందే... అందుకు అవసరమయ్యే నజరానాలు అందించాల్సిందే..!



పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో పవన్‌కళ్యాణ్, కృష్ణ, బాలకృష్ణ వేషధారణలో కళాకారులు



పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో పూలు జల్లుతున్న డ్రోన్



పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో అభిమానులపై పూల వర్షం కురిపిస్తున్న డ్రోన్



పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవిల నామినేషన్ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవి నామినేషన్ ర్యాలీలో ఆకాశంలో ప్యారా గ్లైడ్ చేస్తున్న టీడీపీ అభిమానులు

నామినేషనోత్సవాలు

మండే ఎండలో.. జన హోరు.. జోరు మధ్య సోమవారం కూటమి తరపున పోటీ చేసే టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కూటమి శ్రేణుల జయజయధ్వానాలు.. టపాకాయలు, తీన్‌మార్ శబ్దాల మధ్య అభ్యర్థులు ర్యాలీలతో ఆయా నియోజకవర్గ కేంద్రాలు హోరెత్తిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు అభ్యర్థులకు ఎక్కడికక్కడ ఘన స్వాగతం పలికి ఆర్‌వో కేంద్రాల వరకు తీసుకెళ్లి నామినేషన్లు దాఖలు చేయించారు. మార్గమధ్యలో మహిళలు దిష్టితీసి అభ్యర్థులకు వీర తిలకాలు దిద్దారు. కళాకారుల ప్రదర్శనలు, మహిళల నృత్యాలు, యువత సందడితో ర్యాలీలు ఆకట్టుకున్నాయి. దారిపొడవునా పార్టీ శ్రేణులు, మహిళలు అభ్యర్థులకు నీరాజనాలు పలికారు. గుంటూరులో లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థిలు మాధవి, నసీర్‌లు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం నామినేషన్లు దాఖలు చేశారు. ప్రత్తిపాడులో బూర్ల రామాంజనేయులు, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ, గురజాలలో యరపతినేని శ్రీనివాసరావు, వేమూరులో నక్కా ఆనందబాబు, బాపట్ల జిల్లా పర్చూరులో ఏలూరి సాంబశివరావు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు.

- గుంటూరు, ఆంధ్రజ్యోతి



పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో విచిత్ర వేషధారణలో కళాకారులు



పెమ్మసాని నామినేషన్‌లో బొమ్మల ఎద్దులతో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ అభిమానులు



సత్తెనపల్లి అసెంబ్లీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ నామినేషన్ ర్యాలీలో తెలంగాణా డప్పు కళాకారులతో కలిసి పాల్గొన్న పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, తెలుగు మహిళలు



పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో విచిత్ర వేషధారణలో కళాకారులు



వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న రాజస్థాన్ బ్యాండ్ కళాకారులు

- ఆ ముగ్గురు నేతలు ఎమ్మెల్యే.. ఎంపీగా విజయం సాధించారు
- నరసరావుపేట లోక్‌సభ.. అసెంబ్లీ నుంచి..


కాకలు తీరిన నేతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట నియోజకవర్గం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ముగ్గురు నేతలు నరసరావుపేట లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల నుంచి పోటీచేసే అవకాశం దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా.. ఎంపీగా గెలుపొందిన ఘనత సాధించారు. కాకలు తీరిన రాజకీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి నరసరావుపేట లోక్‌సభ, అసెంబ్లీ రెండింటికీ ఎన్నికయ్యారు. కాసు బ్రహానందరెడ్డి 1967లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలు అందజేశారు. 1977, 1980లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన కాసు బ్రహ్మానందరెడ్డి ఘన విజయం సాధించారు. వరుసగా మూడవ సారి 1984లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాటూరి నారాయణస్వామి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తదుపరి బ్రహ్మానందరెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఎంపీగా బ్రహానందరెడ్డికి హ్యాట్రిక్ చేజారింది.



కాసు బ్రహ్మానందరెడ్డి



చాపలమడుగు రామయ్య చౌదరి



కాసు వెంకట కృష్ణారెడ్డి

1951లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో నరసరావుపేట నియోజకవర్గం నుంచి చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలేనికి చెందిన చాపలమడుగు రామయ్య చౌదరి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎంపీగా ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

కాసు బ్రహ్మానందరెడ్డి వారసుడిగా రాజకీయాల్లో అడుగిడిన కాసు వెంకటకృష్ణారెడ్డి నరసరావుపేట నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978లో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన కాసు కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ కాలంలో ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. 1989, 1991లో జరిగిన ఎన్నికల్లో కాసు వెంకటకృష్ణారెడ్డి వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నరసరావుపేట లోక్‌సభ నుంచి పోటీచేసి ఎంపీగా ఎన్నికయ్యారు. 1996లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోట సైదయ్య చేతిలో పరాజయాన్ని చవిచూసిన ఆయన హ్యాట్రిక్ విజయాన్ని చేజార్చుకున్నారు. 1985, 1999 ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కాసు.. కోడెల చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు కాసు వెంకటకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై పలు మంత్రి పదవులను నిర్వహించారు. కాసు కృష్ణారెడ్డి రెండుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా నరసరావుపేట నుంచి గెలు పొందారు.

ఇక్కడి నుంచి రెండు సార్లే ఛాన్స్

నరసరావుపేట లోక్‌సభ నుంచి ఎవరికైనా రెండు సార్లు గెలిచే అవకాశాన్ని ఓటర్లు ఇచ్చారు. హ్యాట్రిక్ బరిలో దిగిన నేతలను ఓడించిన ఘనత ఇక్కడ ఓటర్లది. 1967, 1971 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నరసరావుపేట లోక్‌సభ నుంచి పోటీచేసి అత్యధిక మెజారిటీతో మద్ది సుదర్శనం గెలుపొందారు. ఆయనకు మూడవసారి ఇక్కడి నుంచి పోటీచేసే అవకాశం దక్కలేదు. 1977, 1980 ఎన్నికల్లో పోటీచేసిన కాసు బ్రహ్మానందరెడ్డి విజయం సాధించారు. 1984 మూడవ సారి ఇక్కడ నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. అలాగే ఆయన వారసుడు కాసు వెంటకకృష్ణారెడ్డి కూడా 1989, 1991 ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు మాత్రమే ఎన్నికయ్యారు. 1996లో హ్యాట్రిక్ బరిలో దిగిన కాసు వెంకట కృష్ణారెడ్డి ఓటమి చెందారు.

- 2004 ఎన్నికల్లో చిలకలూరిపేటలో విచిత్ర పరిస్థితి
- పార్టీ టికెట్ ఇచ్చి... ఆ అభ్యర్థికి ఓటు వేయవద్దని ప్రచారం

మా అభ్యర్థే..

కానీ ఓటెయ్యొద్దు

చిలకలూరిపేట, ఏప్రిల్ 22: ఎన్నికల్లో పోటీచేసే పార్టీ అభ్యర్థిని ప్రకటించారు. బీఫారం కూడా ఇచ్చారు. నామినేషన్ల పర్వం పూర్తయింది. బ్యాలెట్ పేపర్‌లో పార్టీ గుర్తు కేటాయింపు కూడా జరిగింది. అయితే ఆ అభ్యర్థికి మాత్రం ఓటు వేయవద్దంటూ పార్టీ నాయకులే ప్రచారం చేసిన పరిస్థితి. ఇది 2004 ఎన్నికల్లో చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగింది. ఆ ఎన్నికల్లో ఈ అసెంబ్లీ నియోజకవర్గం గుంటూరు పార్లమెంటు పరిధిలో ఉంది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా రాయపాటి సాంబశివరావు పోటీలో ఉన్నారు. చిలకలూరిపేట అసెంబ్లీ కాంగ్రెస్ సీటును రాయపాటి సూచన మేరకు పట్టణానికి చెందిన సీనియర్ కళాకారుడు మల్లాది శివన్నారాయణకు కేటాయించారు. 1978 నుంచి చిలకలూరిపేట కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడుగా ఉండి ఆరుసార్లు అసెంబ్లీకి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన సోమేపల్లి సాంబయ్య వర్గానికి కాకుండా వేరొకరికి టికెట్ ఇవ్వడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో తమ వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. అప్పుడు సాంబయ్య కుటుంబానికి చెందిన మర్రి రాజశేఖర్‌ను ఇండిపెండెంట్ గా నామినేషన్ వేశారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ఈ నియోజకవర్గానికి వచ్చినప్పుడు కాంగ్రెస్ శ్రేణులు తమ అసంతృప్తి ఆయన ఎదుట బహిరంగంగా వ్యక్తం చేశాయి. పార్టీ శ్రేణులు నిరసన తెలిపాయి. దీనితో కాంగ్రెస్ నాయకత్వం పరిస్థితిని గమనించి మల్లాది శివన్నారాయణను పోటీ నుంచి తప్పించింది. శివన్నారాయణ తాను పోటీ నుంచి విరమించుకుంటున్నానని, కాంగ్రెస్ శ్రేణులు మర్రి రాజశేఖర్‌కు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకత్వం కూడా చిలకలూరిపేటలో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేయవద్దని, మర్రి రాజశేఖర్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేసింది. రైలింజన్ గుర్తుతో రాజశేఖర్ ఎన్నికల్లో పోటీ చేసి కేవలం 212 ఓట్ల ఆధిక్యతతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. చిలకలూరిపేట చరిత్రలో ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి ఎన్నికల్లో గెలవడం అదే తొలిసారి. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బ్యాలెట్‌లో పేరు ఉన్న మల్లాది శివన్నారాయణకు 7,841 ఓట్లు రావడం విశేషం.



మర్రి రాజశేఖర్



మల్లాది శివన్నారాయణ

టీడీపీ కార్యాలయ దహనం పిరికిపందల చర్య

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 22: బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం దహనం పిరికిపందల చర్య అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గం నాగిరెడ్డిపాలెంలో అర్ధరాత్రి తెలుగుదేశంపార్టీ కార్యాలయాన్ని తగలబెట్టడం దుర్మార్గమని, టీడీపీపై ప్రజలలో వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక ఇటువంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. ఇటీవల క్రోసూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తగలబెట్టిన విషయం మరవకముందే మరలా బెల్లంకొండ మండల తెలుగుదేశం కార్యాలయం తగలబెట్టడం దారుణమని, ఇంతకంటే నీచమైనపని మరొకటి ఉండదన్నారు. అధికార పక్షానికి ఓటమి కళ్ళముందు కనిపించడంతో కవ్వింపుచర్యలకు పాల్పడుతున్నారని, పోలీసులు తక్షణమే దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.

టీడీపీ కూటమితోనే అరాచక పాలనకు ముగింపు

● కూటమి నేతలు లావు, చదలవాడ



పమిడిపాడు మసీదులో ప్రార్థనలు చేస్తున్న కూటమి నాయకులు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 22: వైసీపీ విధ్వంస, అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కావాలంటే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం మండలంలోని ములకలూరు, కేతముక్కల అగ్రహారం, పమిడిపాడు గ్రామాలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత కోల్పోయారన్నారు. దూరదృష్టి, పాలనాదక్షత ఉన్న చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకున్నప్పుడే అభివృద్ధి, మీ పిల్లలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, పేదల కష్టాలు తీరుతాయని అన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబును, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం సేకరించిన భూములు, ప్రభుత్వ భవనాలు దేనికీ పనికిరాకుండా జగన్ చేశారన్నారు. చంద్రబాబుది అభివృద్ధి పాలనైతే.. జగన్రెడ్డిది విధ్వంసపాలన అని, ఇలాంటి వ్యక్తి ఎప్పటికీ రాజకీయాల్లోకి రాకుండా ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. బటన్ నొక్కి మోసం చేస్తున్న వైసీపీ పాలకులను ఇంటికి పంపేందుకు మీకూ బటన్ నొక్కే అవకాశం వచ్చిందని అన్నారు.

తుంగపాడులో అరవిందబాబు ప్రచారం

రొంపిచర్ల ఏప్రిల్ 22: రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు ఆదివారం రాత్రి పేర్కొన్నారు. మండలంలోని తుంగపాడులో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించారు. సూపర్-6 పథకాల గురించి వివరించారు. రాబోయేది కూటమి ప్రభుత్వమేనని అరవిందబాబు తెలిపారు. రాష్ట్రాన్ని దొంగల నుంచి కాపాడాలని కోరారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో దాడులు పెరిగాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, కపలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన నరసింహస్వామి హోమంలో పాల్గొన్న ప్రత్తిపాటి దంపతులు

మంచి, చెడుల మధ్య యుద్ధంలో కూటమిదే విజయం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 22: రాష్ట్రంలో జరగబోతున్న ఎన్నికల్లో మంచి చెడుల మధ్య జరిగే యుద్ధంలో కూటమిదే విజయమని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం చిలకలూరిపేట కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేయనున్న నేపథ్యంలో విజయం సాధించాలని సంకల్పిస్తూ పట్టణంలోని తన నివాసంలో సోమవారం సుదర్శన నరసింహస్వామి హోమం నిర్వహించారు. పండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ క్రతువులో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హోమ ద్రవ్యాలు యజ్ఞగుండాల్లో సమర్పించి పూర్ణాహుతి జరిపించారు. చిలకలూరిపేటతో పాటు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు మేలు జరగాలని ఆయన కోరుకున్నారు.

ఎన్నికల అధికారులతో వైసీపీ కార్యకర్తల వాగ్వాదం

నూజెండ్ల, ఏప్రిల్ 22: ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో వైసీపీ కార్యకర్తలు వాగ్వివాదం చేసిన సంఘటన మండల కేంద్రం నూజెండ్లలో సోమవారం జరిగింది. మండలంలోని సాయినగర్‌కు చెందిన వైసీపీ కార్యకర్తలు వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్ కార్యక్రమానికి వెళ్ళి వస్తున్న సందర్భంలో మోటారు సైకిల్‌కు ఉన్న జెండాలను తీయాలని ఫ్లయింగ్ స్క్వాడ్ సూచించటంతో కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. ఈ విషయంపై ఫ్లయింగ్ స్క్వాడ్‌లోని కానిస్టేబుల్ దురుసుగా వ్యవహరించాడని రోడ్డుపై బైఠాయించారు. కొద్దిసేపు అనంతరం గ్రామస్థులు సర్దిచెప్పటంతో గొడవ సద్దుమణిగింది.

మోటారు సైకిల్ దొంగ అరెస్టు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 22: మోటారు సైకిళ్ళను చోరీ పాల్పడ్డ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు మొదటి పట్టణ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ మండలంలోని యలమంద గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకట శివనాగరాజును సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని ఆర్‌యూబీ వద్ద అరెస్టు చేశామన్నారు. నిందితుడు, మరో నిందితుడు నకరికల్లుకు చెందిన సువార్త శ్యామ్ అలియాస్ వసంత కుమార్‌తో కలసి మొదటి పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నాలుగు మోటారు సైకిళ్ళు, రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మరో మోటారు సైకిల్‌ను దొంగిలించాడన్నారు. వీటి విలువ మొత్తం రూ.2.20లక్షలు ఉంటుందన్నారు. ఇటీవల పట్టణంలోని అరండల్‌పేటలోని ఎస్‌బీఐ వద్ద సంతమాగులూరుకు చెందిన అర్వపల్లి వెంకటనారాయణ తన మోటారు సైకిల్‌ను నిలపగా చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశాడన్నారు. డీఎస్పీ వర్మ ఆదేశాల మేరకు మొదటి పట్టణ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మణికృష్ణ, సిబ్బంది రామాంజనేయులు, వీరాంజీ, సైదా తదితరులు ప్రత్యేకదళంగా ఏర్పడి దర్యాప్తు చేయగా నిందితుడి ఆచూకీ లభించిందన్నారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగిలించిన మోటారు సైకిళ్ళను పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు. నాలుగు మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నామని, మరో నిందితుడిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

రేపు మానుకొండ వారిపాలెంలో విగ్రహ పునఃప్రతిష్ఠ

చిలకలూరిపేట, ఏప్రిల్ 22: చిలకలూరిపేట మండలం మానుకొండ వారిపాలెంలో ఈ నెల 24వ తేదీ బుధవారం ఉదయం ప్రసన్నాంజేయస్వామి సమేత కోదండ రామస్వామి దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు నూతన ఆలయ నిర్మాణ కమిటీ నిర్వాహకులు సోమవారం తెలిపారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందని కూడా తెలిపారు.

విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు ప్రారంభం

వేల్పూరు (శావల్యాపురం), ఏప్రిల్ 22: మండలంలోని వేల్పూరులో ఉన్న శ్రీనీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని, రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పూజలను సోమవారం ప్రారంభించారు. వేదపండితులు కిరణ్‌శర్మ, శ్రీనివాసశర్మ, గ్రామ పురోహితుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం యాగశాలలు ప్రారంభించి పుణ్యదంపతుల చేతులమీదుగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

యాదవులను హత్య చేస్తే అనిల్ ప్రశ్నించలేదేం..!?



గొర్రెల మండి వద్ద ప్రచారంలో పాల్గొన్న జీవీ, మక్కెనలు

వినుకొండ, ఏప్రిల్ 22: పల్నాడు జిల్లాలో వరుసపెట్టి యాదవులను హత్య చేస్తున్నప్పుడు ఎంపీ అనిల్‌కుమార్ ప్రశ్నించలేదేమని కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. పట్టణంలోని మార్కాపురం రోడ్డులో సోమవారం పార్టీ ప్రచారాన్ని మక్కెన మల్లికార్జునరావుతో కలిసి నిర్వహించారు. గొర్రెల మండీలో ఉన్న ప్రజలతో మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో నడివీధిలో చంద్రయ్య, మరల ఆరు నెలల తర్వాత జాలయ్యను వైసీపీ మూకలు హత్యచేసినప్పుడు అనిల్‌కుమార్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలు ముఖ్యంగా యాదవులకు రక్షణ లేకుండ పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీలకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని చెప్పారు. అనిల్‌కుమార్ యాదవ్ నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎందుకు వరికపూడిశెలకు నిధులు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. పల్నాడు ప్రాంతం బాగుపడాలంటే సాగునీరు చాల ముఖ్యమని, కూటమి ప్ర భుత్వం రాగానే గోదావరి జలాలు పల్నాడుకు తీసుకువచ్చి సస్యశ్యామలం చేస్తామన్నారు. అభివృద్ధి సంక్షేమమే కూటమి నినాదమని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు చెందిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీ చేరికలు

టీడీపీలోకి భారీగా వలసలు కొనసాగుతున్నాయి. వినుకొండ మండలం

కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు

లోని బ్రా హ్మణపల్లి పంచాయతీ, నాగిరెడ్డి పల్లె డ్రైవర్స్ కాలనీ, రాజీవ్‌కాలనీ, ఎస్టీ కాలనీలకు చెందిన 40వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి జీవీ ఆంజనేయులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పట్టణంలోని 20వ వార్డుకు చెంది న 20 కుటుంబాలు, బీపాలెం నుంచి 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారికి జీవీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

● బొల్లాపల్లి: మండలంలోని బీపాలెం నుంచి వైసీపీని వీడి టీడీపీలోకి 20 కుటుంబాలు చేరాయి. వీరికి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● రొంపిచర్ల: మండలంలోని తుంగపాడులో ఆదివారం రాత్రి చదలవాడ అరవిందబాబు సమక్షంలో వైసీపీ వార్డు మెంబరు మల్లెల ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

రొంపిచర్ల మండలంలో లావు మేఘన ప్రచారం

రొంపిచర్ల, ఏప్రిల్ 22: మండలంలోని రొంపిచర్లలో కూటమి ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు సతీమణి లావు మేఘన సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు కట్ట సెంటర్ నుంచి ప్రచారం జరిగింది. కార్యక్రమంలో గోనుగుంట్ల కోటేశ్వరరావు, పొనుగోటి శ్రీనివాసరావు, పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, వడ్లమూడి కిషోర్, కల్లి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

రొంపిచర్ల, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని జడ్పీ పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలల విద్యార్థులు సోమవారం వెలువడిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. బుచ్చిబాపన్నపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థులు 75శాతం, సంతగుడిపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు 78.18, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు నూరు శాతం, రెడ్డిపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థులు 89.25 శాతం, కొత్తపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు 85.71 శాతం, ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు నూరు శాతం, జడ్పీ పాఠశాల రొంపిచర్ల విద్యార్థులు 80.49 శాతం, గోగులపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు 89.29 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు డీ వెంకటదీపిక 583, ఎం.భవ్యశ్రీ 582, సీహెచ్ వెంకటఅవినాష్ 580మార్కులు సాధించారు. గోగులపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు అభినయ564, వెంకటచంద్రిక 562, జీ చంద్రిక 551 మార్కులు సాధించారు. వీరిని ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

● చిలకలూరిపేట, ఏప్రిల్ 22: ప్రాంతంలోని పలు విద్యా సంస్థల్లో 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారు. బొప్పూడిలోని పూసల సుబ్బయ్య, గుంటు వెంకటఅప్పయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్షకు హాజరైన 58 మందిలో 51 మంది ఉత్తీర్ణులయ్యారు. మురికిపూడిలోని కందిమళ్ళ శారదాంబ జడ్పీ హైస్కూల్‌లో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. హాజరైన 116మంది విద్యార్థుల్లో 93 మంది ఉత్తీర్ణులయ్యారు. చిలకలూరిపేట విద్యా సంఘం వారు నిర్వహిస్తున్న ఆర్‌వీఎస్, సీవీఎస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో లాస్య 577, రుబీనా 576, పార్వతి 571, భవానీ 570 మార్కులు సాధించారు.

● నాదెండ్ల: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 11 పాఠశాలలు ఉండగా 634 మందికి గాను 557 మంది ఉత్తీర్ణులయ్యారు. చిరుమామిళ్ళ గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 61మంది ఉత్తీర్ణులయ్యారు. కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలకు చెందిన పీ కార్తీక్‌రెడ్డి 585 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానం, మోడల్ పాఠశాల విద్యార్థులు గాయత్రి సంజీవని 580 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో నిలిచారు. సాతులూరు పాఠశాల 74శాతం, కనపర్రు పాఠశాల 89శాతం, తూబాడు 80శాతం, సంక్రాంతిపాడు 89శాతం, నాదెండ్ల 94శాతం, అమీన్‌సాహెబ్‌పాలెం 89శాతం, గణపవరం 84శాతం, ఎండుగుంపాలెం 80శాతం, మోడల్ పాఠశాల 97శాతం, కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాల 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన చిరుమామిళ్ళ విద్యార్థులను గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అభినందించారు.

● యడ్లపాడు, ఏప్రిల్ 22: మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సయ్యద్ జావేద్ 600మార్కులకుగాను 580 సాధించగా గాండ్ల సుశాంత్ 574 మార్కులు సాధించారు. కాగా మండలంలో 10 ప్రభుత్వ 4ప్రైవేటు పాఠశాలలతో పాటు ఒక ఎయిడెడ్ పాఠశాలల నుంచి 548మంది హాజరుకాగా హాజరు కాగా 470మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 85.77గా నమోదైంది. గత ఏడాది 65శాతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం 18శాతం పెరిగింది యడ్లపాడు నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు ముత్తవరపు అరుణ్‌కిరణ్ 587, పల్లపు వైష్ణవి 586, కర్రి లక్ష్మీలహరి 580 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన తెలిపారు. 70మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అలాగే సెయింట్ ఆన్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రేవతి 587, ప్రమిద 586, సత్యసూక్తి 578 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

● వినుకొండ టౌన్: పదో తరగతి పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. వినుకొండ మండలంలోని మొత్తం 15 ప్రభుత్వ పాఠశాలలో 925మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 760మంది విద్యార్థులు, 82శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఎం.భానుప్రసన్న, సీహెచ్ పావని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నారు. అలాగే జడ్పీహెచ్ఎస్ ఉర్దూ పాఠశాలలో నూరుశాతం, ప్రభుత్వ బాలుర పాఠశాలలో 55శాతం ఉత్తీర్ణత సాధించారు.

● ఈపూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 80.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో జఫ్రుల్లాఖాన్ తెలిపారు. బొగ్గరం హైస్కూల్ విద్యార్థులు జి.శ్రీనివాస్, ఎస్ సౌమ్య మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మండలంలో ముప్పాళ్ళ హైస్కూల్ 95శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలువగా ఈపూరు హైస్కూల్ 68శాతం ఉత్తీర్ణత సాధించి చివరి స్థానంలో నిలిచింది.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జడ్పీ హైస్కూల్ జీ రామానంద భరద్వాజ ప్రథమ స్థానం, బీ జశ్వంత్ ద్వితీయ స్థానం, ఏ బిందు ప్రియ తృతీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం షేక్ అలేషా సోమవారం తెలిపారు. బొల్లాపల్లి జడ్పీ హైస్కూల్ నుంచి 63 మంది విద్యార్థులకు 53 మంది, మేళ్ళవాగు జడ్పీ హైస్కూల్ నుంచి 22మందికి 15 మంది, గుమ్మనంపాడు జడ్పీ హైస్కూల్ నుంచి 46 మందికి 26మంది విద్యార్థులు, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల నుంచి 30విద్యార్థులకు గాను 24మంది, ఏపీ మోడల్ స్కూల్ 72 మంది విద్యా ర్థులకు గాను 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

● శావల్యాపురం: మండలంలోని ఐదు జడ్పీ పాఠశాలల్లో 260మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా వారిలో 239మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, 91.9శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు సోమవారం తెలిపారు. వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన పొత్తూరి భువనసాయిసుభాష్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ద్వితీయస్థానాన్ని, మండలంలో ప్రథమస్థానాన్ని సాధించగా అదే పాఠశాలకు చెందిన మానం హేమంత్ సాయికృష్ణ జిల్లావ్యాప్తంగా నాలుగో స్థానాన్ని, మండలంలో ద్వితీయస్థానాన్ని సాధించాడు. శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన కన్నెదారి కళ్యాణ్ తృతీయ స్థానాన్ని, చెవల చంద్రశేఖర్ నాలుగో స్థానాన్ని సాధించారన్నారు.

● నూజెండ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 418 మంది పరీక్షలు రాయగా 366 మంది 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయా నికి చెందిన 74 మంది పరీక్షలు రాయగా 71 మంది ఉత్తీర్ణత సాధించారు. నూజెండ్ల కేజీబీవీ 35మందిలో 33మంది ఉత్తీర్ణత సాధించారు. ములకలూరు జడ్పీ పాఠశాలకు చెందిన 37 మందికి గాను 27 మంది, కంభంపాడు 33 మందిలో 25మంది, సీతారామపురం శ్రీవెంకటేశ్వరస్వామి హైస్కూల్ విద్యార్థులు 18 మంది పరీక్షలు రాయగా 13 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో-2 రవి చంద్ర తెలిపారు.

నేడు మాజీ మంత్రి ప్రత్తిపాటి నామినేషన్

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 22: మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఉదయం 11 గంటలకు పండరీపురం తన నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరి చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయంలో 2:29 గంటలకు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు చిలకలూరిపేట ప్రజానీకం వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాటి కోరారు.

నాలుగు నామినేషన్లు దాఖలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 22: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో సోమవారం వివిధ పార్టీలకు చెందిన నలుగురు తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా కావటి మనోహరనాయుడు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన రెండు సెట్ల పత్రాలను రిటర్నింగ్ అధికారి బీ నారదమునికి అందజేశారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా నల్లపు కోటేశ్వరరావు, నవతరం పార్టీ అభ్యర్థిగా రావు సుబ్రహ్మణ్యం, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా ఒంటరి విజయమ్మ నామినేషన్ వేశారు.

వినుకొండలో ఐదు నామినేషన్లు

వినుకొండ, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం 5నామినేషన్లు వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి సుబ్బారావు తెలిపారు. వైసీపీ తరపున అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు, కుమారుడు బొల్లా గిరిబాబులతోపాటు దాట్ల అంజిరెడ్డి, షేక్ బాజి, చిన్న కాశయ్యలు నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

26లోపు పోస్టల్ బ్యాలెట్లను ఆర్వోలకు అందజేయాలి

చిలకలూరిపేట, ఏప్రిల్ 22 : ఈ నెల 26వ తేదీలోపు పోలింగ్ రోజున విధులు నిర్వహించే వారందరూ ఫారం-12 ద్వారా ఓటు హక్కు నమోదైన సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేస్తూ, విధులు నిర్వహించే రిటర్నింగ్ అధికారికి అందజేయాలని చిలకలూరిపేట ఆర్వో బీ నారదముని తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించి నాదెండ్ల మండలం గణపవరంలో ఉన్న కెల్లంపల్లి భద్రాచలం జడ్పీ హైస్కూల్‌లో మే నెల 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్లు వినియోగించునే వారందరికీ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. మే 5న పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఓపీవోలు ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆధారాలను సమర్పించి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని కోరారు. మే 6వ తేదీన పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ల వినియోగించుకుంటారని తెలిపారు. 7వ తేదీన బూత్ లెవల్ ఆఫీసర్లు, వీడియో గ్రాఫర్లు, డ్రైవర్లు పోలింగ్ రోజున విధులు నిర్వహించే ఇతర సిబ్బంది 33 రకాల ఎమర్జెన్సీ సేవలు అందించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్లను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. చిలకలూరిపేటలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, ఇందుకోసం 9949096532, 9493631961 నెంబర్లకు సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

ఘనంగా వేములమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 22: మండలంలోని కొండకావూరులో వేములమ్మ తల్లి దేవస్థానం వార్షికోత్సవ తిరునాళ్ళ ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా ఆలయంలో వేములమ్మకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. కొండకావూరుతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీ ప్రొఫెషనల్ వింగ్‌లో తాళ్ళూరి

చిలకలూరిపేట, ఏప్రిల్ 22: తెలుగుదేశం పార్టీ ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర కమిటీలో చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన తాళ్ళూరి సిద్ధార్థను ప్రధాన కార్యదర్శిగా సోమవారం నియమించారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కే అచ్చంనాయుడు ఈ మేరకు నియమించారు.

గ్రామాల అభివృద్ధిని విస్మరించిన వైసీపీ: శరత్



పార్టీలో చేరిన వృద్ధురాలిని పలకరిస్తున్న ప్రత్తిపాటి శరత్

యడ్లపాడు, ఏప్రిల్ 22: గ్రామాల అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ విమర్శించారు. ఆదివారం రాత్రి బోయపాలెం, యడ్లపాడు గ్రామాల్లో జనసేన, బీజేపీ కూటమి నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి బాట పట్టాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఏ గ్రామానికి వెళ్ళినా తెలుగుదేశం హయాంలో నిర్మించిన సిమెంటు రోడ్లు కనిపిస్తున్నాయని, వాటి పక్కన మురుగునీరు పోయేందుకు కనీసం కాలువలు నిర్మించలేకపోయారని ఎద్దేవాచేశారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా నాశనంచేసి ఎన్నికలు వచ్చేసరికి ప్రజల్ని మరోసారి మభ్య పెట్టేందుకు జగన్ అండ్‌కో సిద్ధమైందన్నారు. భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విచక్షణతో ఓటువేయాలని, అరాచక పాలనకు అంతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యడ్లపాడులో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు శరత్ సమక్షంలో పార్టీలో చేరాయి. వారికి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.